క్లుప్తంగా

ఇంటర్ పరీక్ష కేంద్రంలో తనిఖీ

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్–1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 564 మందికిగాను 15 మంది గైర్హాజరయ్యారు. తహసీల్దార్ ఏవీ రమణ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా కారంపూడి ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయుడు ఏవీ శ్రీవత్స, డీవో రేణుకాదేవి, కోఆర్డినేటర్‌గా ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాసరావు వ్యవహరించారు.

వందశాతం పన్ను వసూళ్లే లక్ష్యం



నరసరావుపేట: నూతన భవనాలతోపాటు పాత భవనాలపై అదనంగా నిర్మించిన కట్టడాలను గుర్తించి పన్నులు వసూలు వందశాతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత రావు కోరారు. ఈ నెల 31వ తేదీ నాటికి ఆస్తి, నీటి, ఖాళీ స్థలాల పన్నులు వసూళ్ల లక్ష్యంపై మంగళవారం మున్సిపల్ అతిథి గృహంలో వార్డు సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఇంజినీరు బి.కనకారావు, రెవెన్యూ అధికారి కె.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బెయిలీబాబు, సయ్యద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సేవలు ఎనలేనివి

నాదెండ్ల: గ్రామాల్లో ఆశావర్కర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎల్.ప్రసాద్‌నాయక్, డాక్టర్ కవితాఅనసూయ చెప్పారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా వర్కర్ పఠాన్ షంషూన్ ఉద్యోగ విరమణ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కరాటేలో ఆక్స్‌ఫోర్డ్ విద్యార్థుల ప్రతిభ

వినుకొండ: పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల ఆక్స్‌ఫోర్డ్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న డి. శివానందన, 8వ తరగతి చదువుతున్న సీహెచ్ ఉమామహేష్‌లు ఇటీవల జరిగిన నేషనల్ డిఫెన్స్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మీకుమారి, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షేక్ ఖాజా మొహిద్దీన్, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



వినుకొండ: గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ రజాక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.శివఫణీంద్ర, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ శ్రీరామ, కిషోర్ బెహరా, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



బొల్లాపల్లి: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లాపల్లి, ఈపూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ ఈపూరు కార్యాలయంలో మంగళవారం న్యూట్రీషన్, యోగా, ఆహారపదార్థాల గురించి వివరించారు. వైద్యులు నవీన్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ఆహార సమతుల్యత పాటించాలని కోరారు. యోగా గురువు అడకా లింగరాజు యోగాసనాల గురించి వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.చిన్నమ్మాయి, కె.రాజ్యలక్ష్మి, వి.శ్రీదేవి, ఎస్‌కే మస్తాన్‌బీ, ఆర్.పద్మజారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి కళాశాల విద్యార్థినుల ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఫస్ట్ సెమ్ పరీక్షా ఫలితాలలో కృష్ణవేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపల్ వై.శ్రీకాంత్ సోమవారం తెలిపారు. తమ విద్యార్థినులు 550 మార్కులకుగాను బీఎస్సీ(కంప్యూటర్స్, ఫిజిక్స్)లో ఎ.సాయిపావని కామాక్షి 533, బీకాం కంప్యూటర్స్‌లో కె.మహాలక్ష్మి 519, బీసీఏలో టి.సౌమ్య 484 మార్కులు సాధించారని వివరించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి టి.సురేఖ, అధ్యాపకులు అభినందించారు.

అండగా ఉంటా.. అధైర్య పడకండి

- మాజీ మంత్రి విడదల రజిని
- బోయపాలెం గ్రామం సందర్శన
- పార్వతీదేవి ఆలయంలో పూజలు
- అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న విడదల రజిని

యడ్లపాడు: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అధికార పార్టీ నేతలు దాడులు, బెదిరింపులకు పాల్పడితే భయపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. తనతోపాటు పార్టీ కూడా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో ఆమె మంగళవారం పర్యటించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు జాతీయ రహదారి పక్కనే ఉన్న పురాతన పార్వతీదేవి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడికి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి వారి బాగోగులను తెలుసుకున్నారు. మండలంలోని గ్రామాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ.. పార్టీకి బలం నాయకులు, కార్యకర్తలే అన్నారు. ప్రతిపక్ష పాత్రలో ప్రజా సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పనిచేద్దామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తనతోపాటు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అందరం కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం వచ్చిందన్నారు. కార్యకర్తలను భయపెట్టేందుకు కూటమి నేతలు చూస్తారని, తాజాగా మర్రిపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబంపై జరిగిన దాష్టీకమే ఇందుకు నిదర్శనం అన్నారు. కొమ్మూరి పున్నారావును కొట్టి, తిట్టి భయపెట్టి తిరిగి వారిపైనే పోలీసులతో కేసు నమోదు చేయించడం కూటమి పాలనకు అద్దం పడుతోందన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది మంచి పాలన కోసమేనని, ప్రతిపక్షాలపై వేధింపులకు కాదన్నారు. బాధ్యతతో ప్రజాసేవ చేయాలని, ఎక్కడైనా అన్యాయం జరిగితే వారికి తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికార పార్టీ దాడులను క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని కోరారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో ధైర్యంగా ఉండాలని సూచించారు. అక్కడి నుంచి వంకాయలపాడు ఎంపీటీసీ సభ్యులు బింజు బుల్లెయ్య ఇంటికి వెళ్లారు. ఇటీవల ఆ ఇంట్లో శుభకార్యం జరిగిన విషయాన్ని తెలుసుకుని ఆయన మనవరాలిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యుల్ని పలుకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఘంటా శంకర్, సొసైటీ మాజీ చైర్మన్ బళల శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ మద్దూరి విజయ బాలచంద్రారెడ్డి, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, నాయకులు బింజు సాంబశివరావు, చాగంటి శ్రీధర్, ఘంటా కిషోర్‌బాబు, సామినేని రాంబాబు, పెద్ది విజయ్‌కాంత్, వి.శ్రీనివాసనాయక్, షేక్ ఖాదర్‌బాషా, షేక్ రసూల్, పల్లపు లక్ష్మీనారాయణ, వలేటి ఉదయ్‌కిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో చెత్త సంపద కేంద్రాలు పనిచేయాలి



చినకంచర్ల గ్రామంలో బహిరంగ వేలంపాటలో పాల్గొన్న పంచాయతీ అధికారులు

శావల్యాపురం: ప్రతి గ్రామ పంచాయతీలలో చెత్త సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని డీఎల్‌పీవో వి.వి.ఎం.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని చినకంచర్ల గ్రామ పంచాయతీలో మేడిచెరువులో చేపల పెంపునకు బహిరంగ వేలంపాట గ్రామంలోని ఎంపీపీ స్కూలు ప్రాంగణంలో గ్రామస్తులు, పంచాయతీ అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ... జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు, ఇంటి పన్నులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్లు, వీధుల్లో వ్యర్థాలను క్లాప్ మిత్రలు చెత్త సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పంచాయతీ నిధులతో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఇంటి పన్ను చెల్లింపుల్లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. డివిజన్ పరిధిలో రూ. 12 కోట్లు బకాయి ఉందని, ఈ నెలాఖరులోగా నూరుశాతం వసూలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం చినకంచర్ల గ్రామ పంచాయతీ మేడిచెరువు బహిరంగ వేలంపాటలో మదమంచి సామ్రాజ్యం రూ. 3.70 లక్షలకు హక్కులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పురేటి నాగేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు చక్రవరపు లలిత శ్రీవల్లీ, చింతా శ్రీనివాసరావు , గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆకాంక్షించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పాఠశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డైరెక్టర్లు నాగోతు సబిత, పాతూరు చక్రధర్, ప్రిన్సిపల్ అల్పనా వునియాల్ పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ మంగళవారం తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటు సారా నిర్మూలనకు చర్యలు

నరసరావుపేట టౌన్: నాటు సారా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ సీఐ ఐ. సోమయ్య హెచ్చరించారు. నవోదయంలో భాగంగా మంగళవారం నకరికల్లు మండలం చేజర్లలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.

వైభవంగా తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో స్వామివారి మూల విరాట్

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని బొగ్గరం గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల అత్యంత భక్తి శ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి దేవాలయ పూజారి పవన్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేకంగా తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టు వస్త్రాలు, వెండి అభరణాలతో అలంకరణ చేశారు. వినుకొండ, నరసరావుపేట, ఇర్లపాడు, ఈపూరు, శావల్యాపురం, పోట్లూరు, కొండాయపాలెం, వనికుంట తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి నూతన వస్త్రాలతోపాటు స్వామివారిని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాలకు చెందిన వారు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు, స్థానిక ఎస్సై ఎం.ఉమామహేశ్వర రావు సహా 200 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రసన్నాంజనేయుని తిరునాళ్లకు సకల ఏర్పాట్లు

- 11న ఈపూరు బోటిమీది ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల
- గత 55 సంవత్సరాలుగా కొనసాగుతున్న వేడుకలు
- రూ. కోటి వ్యయంతో దేవాలయ అభివృద్ధి పనులు



శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం (ఇన్‌సెట్) స్వామి వారి మూల విరాట్

ఈపూరు (శావల్యాపురం): మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో వేంచేసియున్న బోటి మీది ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల వేడుకలు ఈ నెల 11వ తేదీన వైభవంగా నిర్వహించటానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే స్వయంభువుగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడ తిరునాళ్ల ఏటా మహాశివరాత్రి తర్వాత వచ్చే మొదట త్రయోదశి నాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 55 ఏళ్ల కిందట చిన్న ఆలయం ఇక్కడ ఉండేది. 2014లో పాత దేవాలయాన్ని ఈపూరుకు చెందిన సీనియర్ పాత్రికేయులు రావూరి చంద్రశేఖర్, బోండాల శ్రీను, వేజండ్ల మహేష్‌లు ఆధ్వర్యంలో తీర్చిదిద్దారు. డిసెంబరులో పనులు ప్రారంభించి 2015 మార్చి నాటికి పునఃనిర్మాణ పనులను దాతలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సారథ్యంలో రూ. కోటి వ్యయంతో పూర్తి చేశారు. ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, మక్కెన మల్లికార్జునరావు, తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, దాతలు, గ్రామస్తులు తమవంతు సహకారం అందించారు. సెంటు భూమి, రూపాయి నిధులు లేని ఈ ఆలయానికి ప్రస్తుతం రూ.16 లక్షలు డిపాజిట్లు రూపంలో ఉన్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి రావూరి చంద్రశేఖర్ తెలిపారు. గత ఏడాది వనికుంట గ్రామస్తులు సత్రం నిర్మించారు. తిరునాళ్ల సమయంలో ఆలయాన్ని రూ.లక్షల వ్యయంతో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరణ చేస్తారు. తిరునాళ్ల సందర్భంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా స్వామి వారిని దర్శించుకొని భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. స్వామి వారిని దర్శించుకుంటే పాడి పంటలతో కళకళ లాడుతారని, సుఖ సంతోషాలతో ఉంటారని రైతులు విశ్వాసంతో కొలుస్తారు. తిరునాళ్లకు ముందు రోజు స్వామి వారి కల్యాణ వేడుకలు వేదపండితులు వైభవంగా నిర్వహిస్తారు.

ఇదీ చరిత్ర

ఈపూరు నుంచి ఆరేపల్లి ముప్పాళ్ళ గ్రామానికి వెళ్లే మార్గంలో నాగజెముడు పొదల్లో ఉన్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి విగ్రహాన్ని పశువుల కాపరులు గుర్తించారు. విగ్రహాన్ని శుభ్రం చేసి ఈపూరుకు పడమర దిశగా ప్రతిష్ఠించారు. ఆలయ పునః నిర్మాణ పనుల్లో మూల విరాట్ విగ్రహాన్ని కదల్చకుండా పనులు పూర్తి చేశారు. అప్పటి నుంచి ఏటా తిరునాళ్ల వేడుకలు జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. తిరునాళ్ల రోజున స్వామివారిని దర్శించుకొనే భక్తులకు అన్నదానం, ఇతర ప్రసాదాలు పంపిణీ చేస్తారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

నరసరావుపేట: జిల్లాలో రైతులు పండించిన మిర్చి క్వింటాలు రూ.25 వేలకు కొనుగోలు చేయాలని, వరికెపుడిశెల ప్రాజెక్ట్‌కు తగిన నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతూ ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మంగళవారం ఈ మేరకు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం గ్రామ పరిధిలో హెచ్‌టీ స్తంభాలు, లైన్ల మార్పిడి కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు గృహ, వాణిజ్య, చిన్న, భారీ పరిశ్రమలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఏడీబీ) శాఖ ముందు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ దత్తా హాస్పిటల్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, సిబ్బంది 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బ్యాంకు శాఖ మేనేజర్ ఎం.పాల్‌బెజాలీల్, ఫీల్డ్ ఆఫీసర్ ఎం.రమణయ్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

నరసరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహాలక్ష్మి నగర్‌లోని సఖి వన్‌స్టాప్ సెంటర్ వద్దనున్న సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి నోడల్ అధికారి పి.అరుణ, పి.స్రవంతి, జి.నవీన, వాణిశ్రీ, సంగీత పాల్గొన్నారు.

హక్కులపై మహిళలకు అవగాహన ముఖ్యం



యడ్లపాడు స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ

యడ్లపాడు: మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలంటే ముందుగా హక్కుల గురించి తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జోజమ్మ చెప్పారు. మిషన్ శక్తి, ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ చేపట్టారు. బాల్య వివాహాల నిర్మూలనకు సంతకాల సేకరణ చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలోని మండల ప్రాథమిక ఎస్టీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు బాలల హక్కులు, మహిళా చట్టాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, బాల్యవివాహాల నిర్మూలన, విద్యాహక్కు చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం సరస్వతి, ఉపాధ్యాయురాలు సుధ, ఏఎస్ఐ దాసు, రైటర్ వీరయ్య, కానిస్టేబుల్ భార్గవ్, హోంగార్డ్ రహమతుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.వెంకటరమణ, ఎం.జోజమ్మ, కార్యకర్తలు ఎం.అరుణ కుమారి, మల్లేశ్వరి, సరోజిని, రాజ్యలక్ష్మి, అరుణ, పరిమళ, సుజాత, బంగారి పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చిలకలూరిపేట: పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో వేగం పెంచాలని సూచించారు. మార్చి 31వ తేదీలోగా వంద శాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పన్ను వసూళ్లకు సంబంధించి పాత బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రోజూ పన్ను వసూళ్లపై అధికారులు సమీక్ష నిర్వహించి, వెనుకబడ్డ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. పైపులైన్ లీకుల వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతం పట్టణంలో రోజుమార్చి రోజు నీరు సరఫరా చేస్తున్నారని, ఈ నేపథ్యంలో పైపులైను లీకులు సరిచేసి ఏప్రిల్ 15వ తేదీకల్లా రోజూ నీరు సరఫరా చేయడానికి సమాయత్తం కావాలని ఆదేశించారు. దీని కోసం ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, రెవెన్యూ ఆఫీసర్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు సులువుగా అనుమతులు

చిలకలూరిపేట: భవన నిర్మాణాలకు సంబంధించి సులువుగా అనుమతులు పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాలులో భవన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులపై సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాన్ అప్రూవల్ కోసం రుసుములు ఆన్‌లైన్‌లో చెల్లించి అనుమతి పొందవచ్చన్నారు. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి మధుకుమార్ సంబంధిత జీవోలపై అవగాహన కల్పించారు.ప్లానింగ్ ఆఫీసర్ జి సుబ్బారెడ్డి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల, దాచేపల్లి, గురజాల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు సూచనలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో వరలక్ష్మి

నూజెండ్ల: రైతులందరు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడితే దిగుబడులు ఆశించిన స్థాయిలో వస్తాయని మండల వ్యవసాయ అధికారి సుగుణాబేగం అన్నారు. మండలంలోని చింతలచెరువు గ్రామంలో రైతుసేవా కేంద్రంలో ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ బ్రోమోడయోలిన్ మందును వినియోగించటం ద్వారా ఎలుకలను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వంద శాతం రాయితీపై బ్రోమోడయాలిన్ మందును సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ గోపి, రైతులు పాల్గొన్నారు.

వినుకొండ: మండలంలోని పెదకంచర్ల రైతు సేవా కేంద్రంలో ఎలుకల సామూహిక నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ వీఏఏ దుర్గావరప్రసాద్ నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్: మండలంలోని రావిపాడులో ఎలుకల సామూహిక నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి పాల్గొన్నారు. ఏడీఏ మస్తానమ్మ మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి అబ్బూరి సుబ్బారావు, వ్యవసాయ సహాయకులు ఉమారాణి, రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రైతులందరూ సామూహికంగా ఒకే రోజు ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల పంటను రక్షించుకోవడం సులభమవుతుందని మండల వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. మంగళవారం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణకు అవసరమైన మందును తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు.

ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలి



కార్యక్రమంలో అధికారులు, పోలీసులు

నరసరావుపేట: ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎన్‌డీపీఎస్ డ్రగ్స్ క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మణ్ హెచ్చరించారు. మంగళవారం సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని వాసవీ కల్యాణ మండపంలో నార్కోటిక్ డ్రగ్స్‌పై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, పోలీస్ శాఖ సంయుక్తంగా పల్నాడు జిల్లా హోల్‌సేల్, రిటైల్ షాపుల వ్యాపారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. పరిపాలనా శాఖ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మణ్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ డి.సునీత హాజరయ్యారు. వ్యాపారులకు పలు సూచనలు చేశారు. అన్ని మెడికల్ షాప్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం చేపట్టిన నాషా ముక్త్ భారత్ అభియాన్ గురించి వ్యాపారులకు వివరించారు. జిల్లాలోని అన్ని కెమిస్ట్ అసోసియేషన్ల ప్రతినిధులు, 250 మంది మెడికల్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మిరపలో లాభాలు



సొలస గ్రామంలో రైతు సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

యడ్లపాడు: సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులకు సిరులను తీసుకువచ్చే పంట మిరప అని పల్నాడు జిల్లా ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నగేష్ చెప్పారు. మండలంలోని సొలస గ్రామంలో ఏరువాక కేంద్రం, ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎం.నగేష్ మాట్లాడుతూ చీడపీడల నివారణలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉద్యానశాఖ అధికారి వి.విశాల్ పలు పథకాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు జ్యోత్స్న గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో వాగ్దేవి కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. బీసీఏ హానర్స్‌లో 550 మార్కులకుగాను ఓ.ఉషశ్రీ 495, పి.మృదుల 471, పి.సింధూర 467, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో పి.కళ్యాణి 479, సిహెచ్.కోటేశ్వరమ్మ 476, యు.విజయరామరాజు 475, బీకాం హానర్స్ కంప్యూటర్ అప్లికేషన్‌లో ఎం.చందన 476, బి.వసుంధర 472 మార్కులు సాధించినట్టు వివరించారు. విద్యార్థులకు కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com